క్లుప్తంగా

కాళోజీ నారాయణరావు వర్ధంతి



జడ్చర్ల టౌన్: కాళోజి నారాయణరావు వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని అనురాగిణి అరక్షిత నిలయంలో నివాళి అర్పించారు. సంస్కార భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంస్కారభారతి సభ్యులు పాల్గొన్నారు.

కమిటీ నియామకం

జడ్చర్ల టౌన్: ముదిరాజ్ చైతన్య వేదిక జడ్చర్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా రాములును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల బాబయ్య నియామకపు పత్రం అందజేశారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడిగా లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య, ఉపాధ్యక్షులుగా వెంకటయ్య, సత్యం, కార్యదర్శిగా లింగం, కోశాధికారిగా రమేష్, కార్యవర్గ సభ్యులుగా నర్సింహులు, గోపాల్‌లను నియమించారు. కార్యక్రమానికి రాష్ట్ర కో ఆర్డినేటర్ పిట్ల నర్సింహులు, వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి భానుప్రకాష్‌లు హాజరయ్యారు.

కందూర్‌లో ఆకాశ దీపోత్సవం



అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆకాశ దీపోత్సవం నిర్వహించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో లక్ష్మి, గణపతి పూజను నిర్వహించి ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపాన్ని వెలిగించారు. మాసం ముగిసే వరకు రోజూ ఆకాశ దీపాన్ని వెలిగించనున్నట్లు ఆలయ ఈఓ రాజేశ్వరశర్మ తెలిపారు.

ఆలయానికి రూ.1.16లక్షల విరాళం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై పురాతన కాలంలో నిర్మించిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం శిథిలావస్థకు చేరడంతో పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా దాతల నుంచి విరాళాలను సేకరిస్తోంది. మూసాపేటకు చెందిన ముక్త బసప్ప కుమారులు ఆలయం పునర్నిర్మాణం కోసం రూ.1,16,000లను విరాళంగా అందజేశారు. ఇదిలా ఉండగా శాశ్వత సభ్యత్వంగా సభ్యుల నుంచి రూ.5వేలను స్వీకరిస్తున్నారు. కాగా దాతలు ముందుకు వస్తే ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ అస్కని నరేందర్ తెలిపారు.

ప్రతిభా పురస్కారాలు అందుకోండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యా, ఉద్యోగ రంగాల్లో ప్రతిభ కనపరిచిన యాదవ సామాజిక వర్గ విద్యార్థులకు, అభ్యర్థులకు యాదవ విద్యావంతుల వేదిక మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలతో సన్మానించనున్నారు. వేదిక జిల్లా అధ్యక్షుడు అంజన్న యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జుర్రు నారాయణ యాదవ్, ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్ యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో వివరాలు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, నీట్, ఐఐటీ, ఎంసెట్ తదితరాల్లో ప్రతిభ కనబరిచినవారు అర్హులన్నారు. వివరాలకు మల్లేష్ యాదవ్ 9985880205, శ్రీశైలంయాదవ్ 9492814871, అంజన్న యాదవ్7382824474 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వండి



కోయిల్‌కొండ: బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఈ సారి అవకాశం ఇవ్వాలని నారాయణపేట కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి కోరారు. సోమవారం మండలంలోని మనికొండ, పేర్కివీడు, రాజునాయక్‌తండా, కేశ్వాపూర్, వీరంపల్లి, ఆచార్యపూర్ గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

నారాయణపేట: చిట్టెం కుటుంబంతో ఉన్న సన్నిహితులను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి ఆదివారం పట్టణంలో కలిశారు. ఈ సందర్భంగా 2005లో మావోయిస్టుల కాల్పుల్లో మరణించిన దూలం విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులను కలిశారు. అధైర్యపడొద్దని మీ అందరికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

లాభాల పంట.. డ్రాగన్ ఫ్రూట్

ఆసక్తి చూపుతున్న రైతులు





పగిడ్యాల్‌లో సాగువుతున్న డ్రాగన్‌ఫ్రూట్

గండేడ్: మారుతున్న పరిస్థితులకనుగుణంగా లాభాల పంటలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. డిమాండు ఉన్న వాటిని ఎంచుకొని ఎలాంటి రసాయనాలు ఆర్గానిక్ ఎరువులతో సాగుకు నడుం బిగిస్తున్నారు. పోషక విలువలు కలిగిన దిగుబడి తీస్తున్నారు. మండల పరిధిలో పగిడ్యాల్, తదితర గ్రామాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు పెరుగుతోంది. ఇక్కడి రైతులు సంగారెడ్డి నుంచి రూ. 70కి ఒకటి చొప్పున మొక్కలు తెచ్చి ఎకరాకు 2 వేల మొక్కల వరకు నాటుతున్నారు. మొక్కలకు ఆసరాగా స్తంభాలను నాటుతున్నారు. డ్రిప్ సిస్టం ద్వారా నీటి వసతి ఏర్పాటు చేసుకుంటున్నారు.

రెట్టింపు ఆదాయం...

మొక్కలు నాటిన సంవత్సరం నుంచే పండ్లు వస్తాయని రైతులు చెబుతున్నారు. ఏటీ మే నుంచి నవంబరు చివరి వరకు దిగుబడి ఉంటుందని అంటున్నారు. మిగతా పంటల కంటే లాభాదాయకంగా ఉంటోందని వివరిస్తున్నారు. ఒకసారి నాటితే 25 సంవత్సరాల వరకు పంట వస్తుందని తెలిసి పలు గ్రామాల రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఆర్గానిక్ ఎరువులతో...

ఆర్గానిక్ ఎరువులతో పండించిన పంటలపై ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతుండడంతో..డ్రాగన్ ఫ్రూట్ సాగులో ఈ రకమైన పంథాను అనుసరిస్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు. వేపపిండి, పశువుల ఎరువులతో పాటు ఘన జీవామృతం వంటివి వినియోగిస్తున్నట్లు వివరిస్తున్నారు.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి బాగా వస్తోంది. పండ్లు కూడ నాణ్యమైనవిగా ఉంటున్నాయి. స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మహబూబ్‌నగర్ లోకల్‌లో అమ్ముకుంటున్నాం. దీనివల్ల రేటు తక్కువగా వస్తోంది. హైదరాబాద్ దళారులకు 10 శాతం ఇవ్వడంతో పాటు రవాణా ఖర్చులు భారంగా మారుతున్నాయి. సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

– అమినికుంట్ల చిన్న బసప్ప, రైతు, పగిడ్యాల్

లాభదాయకంగా ఉంది



ఇదివరకు వరి తప్పిస్తే మిగతా పంటలపై దృష్టి పెట్టలేదు. కొత్త రకం సాగు చేయాలన్న ఉద్దేశంతో మా స్నేహితుడు ఆంధ్రాలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను చూశాను. వివరాలు తెలుసుకుని మొదటగా ఎకరా పొలంలో పంట సాగు చేశాను. సాగు చేసి రెండేళ్లవుతోంది. మొదటి పంట టన్నున్నర పైన వచ్చింది. రూ.లక్షన్నర వరకు వచ్చింది. ఇంకా ఈ పంటను విస్తరిస్తాను.

–గంగాధర్, గండేడ్

అభివృద్ధికి కేరాఫ్‌గా పాలమూరు



ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్ నగర్)/హన్వాడ/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఒకప్పుడు తాగునీటి కూడా తీవ్రంగా కష్టాలు పడిన పాలమూరు నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, వ్యాపారాలు ఎన్నో రెట్లు పెరిగాయని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్‌తో కలిసి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాంమందిర్ చౌరస్తా, పాన్ చౌరస్తా, క్లాక్ టవర్ వద్ద ప్రతి దుకాణానికి వెళ్లి అభివృద్ధిని వివరించారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన తర్వాతా అనేక సమస్యలు పరిష్కరించామన్నారు. వేలాది ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తున్నామన్నారు. తమ మాదిరిగా కాంగ్రెస్ అభివృద్ధి పుస్తకం వేయగలదా అని సవాల్ విసిరారు. అభివృద్ధిని చూసి వివిధ పార్టీల సీనియర్ నాయకులు బీఆర్‌ఎస్‌లోని వచ్చారని వివరించారు. బీజేపీ, కాంగ్రెస్‌లతో అభివృద్ధి ఆగుతుందని, సస్పెన్షన్ బ్రిడ్జి పైపులను కూడా అమ్మేస్తారన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో ఆదివారం వివిధ పార్టీల నాయకులు పార్టీలో చేరారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ సోమవారం రాంమందిర్ చౌరస్తాలో ఓ టిఫిన్ సెంటర్ వద్ద టీ తయారు చేశారు. రోడ్డు పక్కన సీతాఫలాలను కొనుగోలు చేశారు. దుకాణాల వద్దకు వెళ్లి ఓటు అభ్యర్థించారు.

సేవ చేసేందుకే రాజకీయాల్లోకి

ఒక ప్రభుత్వ ఉన్నతాధికారిగా ఎంతో సంతోషంగా ఉన్నా.. ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశ్యంతో రాజకీయాల్లోకి వచ్చినట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్ల మిగిలిపోయిన పనులన్నింటినీ పూర్తి చేసుకుందామన్నారు. ఆదివారం పెద్దర్పల్లి, పల్లెమోనికాలనీ, ఏనెమీదితాండ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.



జిల్లాకేంద్రంలో పార్టీలో చేరిన వారితో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నాలుగో వంతు కూడా పనిచేయాలేకపోయా..

తాను మహబూబ్‌నగర్‌లో 4సార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా కూడా గత పదేళ్లలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేసిన అభివృద్ధిలో నాలుగోవంతుకూడా తాను చేయలేకపోయానని మాజీ మంత్రి పి. చంద్రశేఖర్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో మంత్రిపై ప్రశంసలు కురిపించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు సయ్యద్ ఇబ్రహీం, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్లు ముస్తాక్ రషీద్, వేదవ్రత్, సర్పంచ్‌లు వెంకన్న, వెంకటమ్మ, నాయకులు పాల్గొన్నారు.

స్థానికుడికి అవకాశం ఇవ్వండి



తిర్మలాపూర్ ప్రచారం నిర్వహిస్తున్న అనిరుధ్‌రెడ్డి తల్లి శశికళారెడ్డి

రాజాపూర్/నవాబుపేట: ఎన్నికల్లో తమ కుమారుడు అనిరుధ్‌రెడ్డిని గెలిపించాలని ఆయన తల్లి శశికళారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంతో పాటు తిర్మలాపూర్, తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. స్థానికుడైన తన కుమారుడికి అండగా నిలిచి ఒకసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు. కారుకొండలో సోమవారం దాదాపుగా 70 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. నాయకుడు భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. అడ్వకేట్ వెంకటేష్, మహేష్, పోలీస్ రవి, శ్రీను, రాము, బాల్‌రాజ్, చెన్నయ్య, యాదయ్య ఉన్నారు.

క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలి



మహమ్మదాబాద్: క్రీడల్లో మంచి ప్రావీణ్యం సంపాదించాలని టీఆర్‌ఆర్ ట్రస్టు సభ్యురాలు మేఘన, కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. సోమవారం గాధిర్యాల్ చీకర్లబండ తండా ఆధ్వర్యంలో వన్‌డే క్రికెట్‌టోర్నీ ప్రారంభించారు. పోటీల్లో కుసుమ సముద్రం మొదటి, గాధిర్యాల్ రెండో బహుమతి కైవసం చేసుకున్నాయి. సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, యువకులు తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా దీపావళి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా మండలాలు, గ్రామాలు, పట్టణ కేంద్రాల్లో ఆదివారం, సోమవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నోములు, లక్ష్మీవత్రాలతో గ్రామాలన్నీ భక్తిపారవశ్యంలో మునిగిపోయాయి. చిన్నారులు, పెద్దలు బాణసంచా కాలుస్తూ ఆనందంగా గడిపారు.

– సాక్షినెట్‌వర్క్

రామలింగేశ్వరుడి సన్నిధిలో న్యాయమూర్తి

అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వరస్వామిని సోమవారం వనపర్తి జూనియర్ సివిల్ జడ్జీ రవికుమార్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేసి గౌరమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పూజారులు తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. ఇదిలా ఉండగా భక్తుల సహకారంతో ఆలయం వద్ద అన్నదానం చేసినట్లు ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ తెలిపారు.

ఎన్నికలప్పుడే కనబడతారు



మిడ్జిల్/నవాబుపేట: కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే కనిపిస్తారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం వల్లభ్‌రావుపల్లి, వస్పుల, దోనూర్, సింగందొడ్డి, ఈదులబావి తండా తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌తో ఒరిగేదేమీ లేదన్నారు. తమను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ శశిరేఖ, ఎంపీపీ సుదర్శన్, నాయకులు పాల్గొన్నారు. నవాబుపేట పరిధిలోని ఊరంచుతాండ కాంగ్రెస్ నాయకులు సోమవారం లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి



సాక్షినెట్‌వర్క్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీచైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డి, ఫుడ్, సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప అన్నారు. సోమవారం వడ్డేమాన్, చిన్నవడ్డేమాన్, ఏదులాపూరం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి పరిచామని అన్నారు. కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. టీపీసీసీ మైనార్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సాధిక్ హోంశాఖ మంత్రి మహమూద్ అలీ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

చరమగీతం పాడుదాం



సాక్షినెట్‌వర్క్ : అరాచక చరమగీతం పాడుదామని కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో బైండోవర్‌ల పేరుతో బెదిరించడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్‌కు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ రాష్ట్ర పొలిటికల్ కమిటీ చైర్మన్ మజహర్ షహీద్, నాయకుడు మిర్జా ఖుద్దూస్‌బేగ్, వైఎస్సార్ టీపీ జిల్లా సీనియర్ నాయకుడు మహ్మద్ హైదర్ అలీ కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు.

నమ్మి మోసపోవద్దు



అడ్డాకుల: బీఆర్‌ఎస్‌ను నమ్మి మోసపోవద్దని కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. వేముల, దాసర్‌పల్లి గ్రామాల్లో మాజీ మంత్రి చిన్నారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు మద్దతిచ్చి అధికారంలోకి తేవాలని ప్రజలను కోరారు. శెట్టిశేఖర్, రామన్‌గౌడ్, బాలనర్సిములు, యుగేందర్‌గౌడ్, గోవర్ధన్, సంతోషి, యాట సత్యం, సుధాకర్ తదితరులు ఉన్నారు.

దక్షిణాదిలో తొలి హ్యాట్రిక్ బీఆర్‌ఎస్‌దే



జాజాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలంతా గులాబీ పార్టీవైపే ఉన్నారని, ఈ సారి ఎన్నికల్లో వంద సీట్లు సాధించి తెలంగాణలో బీఆర్‌ఎస్ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి దక్షిణాదిలో హ్యాట్రిక్ సాధించిన తొలిపార్టీగా ఆవిర్భవిస్తుందని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జాజాపూర్, తిర్మలాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామ వీధుల గుండా పర్యటిస్తూ ఓటర్లను కలుసుకుని ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందించి మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన సాధ్యం కాని ఆరు హామీలను నమ్మి మోసపోవద్దని తెలిపారు. 24గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్‌ఎస్‌ను కాదని మూడు గంటల విద్యుత్ ఇస్తామన్న కాంగ్రెస్‌కు ఓట్లు ఎలా వేస్తామని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ వస్తే జనరేటర్లు, ఇన్వెటర్లు తప్పవని తెలిపారు. ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్లు కేసీఆర్ రెట్టింపు చేస్తారని మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, రాములు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

కోయిల్‌కొండ: నియెజకవర్గంలో గ్రామగ్రామాన చేసిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు మరోసారి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని రాంపూర్, మల్కాపూర్, రాజునాయక్‌తండా, తిర్మలంపల్లి, లింగుపల్లి, చంద్రాస్‌పల్లిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మిషన్‌భగీరథతో ప్రతి ఇంటికి తాగునీరు, రైతులకు పెట్టుబడి కింద రైతుబంధు వంటి అనేక పథకాలతో నిరుపేదలు లబ్ధిపొందారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ రవికిరణ్, రవి, భీంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గణేష్ పాల్గొన్నారు.



మరికల్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సమర్థుడైన నాయకుడిని గెలిపించుకుందాం

దామరగిద్ద: బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నేతృత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన సమర్థుడైన నాయకుడుని మరోసారి గెలిపించుకుందామని ఎంపీపీ నర్సప్ప, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దామరగిద్ద, గడిమున్కప్పల్లి, క్యాతన్‌పల్లి, చాకలోన్‌పల్లి, లోకుర్తి, మద్దెల్‌బీడ్ కంసాన్‌పల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నియోజకవర్గంతో పాటు దామరగిద్ద మండలం ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

మరికల్: మండలంలో ఆయా గ్రామాల్లో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు మోసపోయి కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మరో వందేళ్లు రాష్ట్రం వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో రామస్వామి, తిరుపతయ్య, రాములు, బసంత్, కృష్ణారెడ్డి, ప్రకాష్‌శెట్టి, బాలస్వామి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ సీఎం ప్రకటనగొప్ప విషయం

నవాబుపేట: బీజేపీ బీసీ సీఎం ప్రకటన గొప్ప విషయమని, పార్టీని గెలిపించాలని అభ్యర్థి చిత్తరంజన్‌దాస్ సూచించారు. మండలంలో వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

వర్గీకరణపై ప్రధానికి చిత్తశుద్ధి లేదు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణపై ఊసెత్తకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి మాదిగలను మోసం చేశారని ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్) రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్ అన్నారు. వర్గీకరణపై ఆయనకు చిత్తశుద్ధి లేదన్నారు. ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్), టీఎమ్మార్పీఎస్‌ల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. విశ్వరూప మహాసభలో వర్గీకరణపై హామీ ఇస్తారని మాదిగ, ఉప కులాలు భావించాయన్నారు. కానీ మందకృష్ణ పోరాటంలో వెంబడి ఉంటానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజకీయ అవసరాల కోసం మాదిగలను బీజేపీ వాడుకుంటుందని ఆరోపించారు. కమిటీ వేస్తామని ప్రకటించడం దాటవేత ధోరణికి నిదర్శనమని విమర్శించారు. టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్వర్, ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్) జిల్లా అధ్యక్షుడు ఎల్.రమేష్, జిల్లా ఇన్‌చార్జ్ రాజగాని అశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం అయినా తెరుచుకోని పాఠశాల



దోనూర్‌లో సోమవారం మధ్యాహ్నం 12 గంటల వరకు తాళాలు వేసి ఉన్న పాఠశాల

మిడ్జిల్: దోనూర్ ప్రాథమిక పాఠశాల సోమవారం మధ్యాహ్నం 12 గంటలు అవుతున్నా పాఠశాల తెర్చుకోలేదు. ప్రభుత్వం మొదట దీపావళి సెలవు ప్రకటించి, ఎన్నికల నేపథ్యంలో రద్దు చేయడంతో మండలంలోని అన్ని పాఠశాలు తెర్చుకున్నాయి. కానీ ఈ పాఠశాల మత్రం తెరుచుకోలేదు. గ్రామం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటన విషయం తెలిసి ఉపాధ్యాయులు మధ్యాహ్నం 12 గంటల తర్వాత పాఠశాల తాళాలు తీశారు. దీంతో ఉపాధ్యాయుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధ్యక్షుడిగా గొల్లరాజు

హన్వాడ: ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ జిల్లా అధ్యక్షుడిగా పెద్దర్పల్లికి చెందిన గొల్లరాజును సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ నియమించారు. ఈమేరకు నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు.

16న ఉచిత కంటి వైద్యశిబిరం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16న స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సిములు, కార్యదర్శి నారాయణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.